# ఓ కొమ్మ పూసింది

వంటింట్లో అన్నం వారుస్తూన్న కమలమ్మ ''అమ్మాయ్!'' అంటూ కేకేసింది. సమాధానం రాకపోయేసరికి ''శశీ!''అంటూ మళ్ళీ పిలిచింది బిగ్గరగా.

''వస్తున్నానమ్మా!'' అంటూ కుండీలో ఉన్న మొక్కకి నీళ్ళు పొయ్యడం ఆపి, సురేంద్ర చూపులూ చిరునవ్వులూ జ్ఞాపకం వచ్చి, ఒక నిముషం మొక్క కేసి ఆశగా చూసి ''ప్చ్! ఈ కొమ్మ ఇంకా పుయ్యనే లేదు'' అనుకుంటూ వంటింటి వేపు నడిచింది శశి.

''అమ్మా, పిల్చావా?''

''ఆ....ఎవరో వచ్చినట్టున్నారు....వెళ్ళి చూడు.''

హాలుదాటి వీధిగుమ్మం దగ్గరికి వచ్చేటప్పటికి, అక్కడ గుమ్మంలో చిరునవ్వు నవ్వుతూ సురేంద్ర నిలబడి ఉన్నాడు. శశి విస్తుపోయింది, వెంటనే తడబడి, పైట సరిజేసుకుంటూ, ''రండి ... ఇలా .... కూర్చోండి'' అని కుర్చీ చూపించింది.

మెరుస్తూన్న కళ్ళతో శశిని ఒక్కమారు నిండుగా చూసి, చిన్నగా నవ్వి, కాలరు ఒకమారు ఇబ్బందిగా సర్దుకుని, ఉత్సాహంగా వచ్చి, హాల్లో శశి చూపించిన కుర్చీలో కూర్చున్నాడు సురేంద్ర.

శశి మనస్సులో కంగారు - దడ - భయం.

తడబడుతూ తన గదిలోకి వచ్చేసింది.

అద్దంలో తన ముఖం చూసుకుంది. బొట్టు సరిచేసుకుంది. నుదుటినీ చెంపల్నీ తాకుతూన్న ముంగురుల్ని కొంచెం అటూ ఇటుగా సర్దుకుంది. మనసులో కులుకుని అదుపులో పెట్టుకోలేక, అదిరే పెదిమని మునిపంటితో అదిమిపట్టింది. అద్దం చూసుకుంటూ అందాలు సరిదిద్దుకోవడం ఇంకా పూర్తికానేలేదు—

''ఎవరే వస్తే?'' అంటూ కమలమ్మ వేసిన కేక ఖంగుమంటూ విని పించింది.

ఆ కేకకి శశి ఉలిక్కిపడింది. మనస్సులో అదురు.

''ఎలా చెప్పడం? ఏమని చెప్పడం? అయినా సురేంద్ర ఏమిటి? మరీ ఇంటికి వచ్చేశాడు? వస్తున్నట్లు ముందుగా చెప్పినా బాగుండును. ఏమిటో, ఇప్పుడు అమ్మకి ఎలా చెప్పడమో?''

శశి మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ ముందు హాల్లోకి వెళ్ళింది.

సురేంద్ర దర్జాగా కాలిమీద కాలేసుకుని కుర్చీలో కూర్చుని, పక్కనే వున్న పేపర్ తీసుకుని చదువుతున్నాడు. 'ఇబ్బంది పడడంకాని, కొత్తదనం ఫీలవడం కాని ఏం లేకుండా ఇంత ధైర్యంగా కూర్చున్నాడేమిటి?!'

కాస్సేపు తటాపటాయించి, ''వచ్చిందెవరు అని అడుగుతోంది అమ్మ'' అంది శశి.

''నేను అని చెప్పు'' అన్నాడు సురేంద్ర నవ్వుతూ.

అరమోడ్పులవుతున్న కనురెప్పల్ని బరువుగా ఎత్తి ''ఎందుకు వచ్చారు అని అడిగితే?'' అంది శశి.

''ఏముంది? కాలేజీలో అన్ని సబ్జెక్ట్సులోనూ ఫస్ట్ మార్కులతో పాసైన వారిని అభినందించడానికి వచ్చానని చెప్పు.''

''అమ్మో! నాకు భయం'' అంది శశి, బెదురు చూపులతో సురేంద్రని చూస్తూ.

"అదిగో....అదిగో....ఆ చూపే నన్నిక్కడికి లాక్కు వచ్చింది.''

అలా గట్టిగా సురేంద్ర అంటూ ఉన్న సమయంలో—

"ఎవరే వస్తు—?" అంటూ హాల్లోకి వచ్చింది కమలమ్మ.

శశి ఉలిక్కిపడింది.

సురేంద్ర తొట్రుపడుతూ కుర్చీలోంచి లేచి "నమస్కారమండీ!" అన్నాడు.

''అమ్మా!....వీరు....మరేమోనే....సురేంద్రగారని....అదే....మా కాలేజీలో చదువుతున్నారు" అంది శశి భయంభయంగా.

ఓ మారు శశికేసీ, మరో మారు సురేంద్రకేసీ చూసి, ముఖం గంభీరంగా పెట్టి....''అహా....బాగుంది ...ఎవరబ్బాయివి బాబూ?" అనడిగింది కమలమ్మ.

మొదట ఎలా చెప్పాలో ఏం చెప్పాలో తోచలేదు సురేంద్రకి .... కొంచెం తబ్బిబ్బు పడ్డాడు....తర్వాత సర్దుకుని....''మా నాన్నగారూ అమ్మగారూ ఫారిన్‌లో ఉన్నారనుకోండి....అక్కడ వాళ్ళిద్దరూ డాక్టర్లు....తాతయ్యగారిక్కడ బిజినెస్ చేస్తున్నారు....నేను ఆయన దగ్గరుంటున్నాను" అంటూ వినయంగా సమాధానం చెప్పాడు.

"అలాగా? సరే....అయితే, ఇప్పుడు ఏం పనిమీద వచ్చావు?" ముక్తసరిగా అడిగింది కమల.

''అబ్బే, ఏం లేదండి. మీ అమ్మాయికి అన్ని సబ్జక్ట్సులోనూ ఫస్టు మార్కులు వచ్చాయి - అభినందిద్దామనీ - ఇక వెడతానండి" అంటూ ఇబ్బందిగా లేచాడు సురేంద్ర.

శశి మనసు కంగారుపడింది - సురేంద్ర అప్పుడే వెళ్ళిపోతాడా? కాస్సేపు ఉండమని అమ్మ అంటే బాగుండును—

కాని, కమలమ్మ అనలేదు ''సరే బాబూ, వెళ్ళిరా" అంటూ సురేంద్రని సాగనంపి వీధి తలుపు గడియవేసి మరీ వచ్చింది.

సురేంద్ర వెళ్ళిపోయాడని శశి మనస్సు దిగాలుగా వుంది. అతను వెళు తున్నప్పుడు వీధిదాకా వెళ్ళి సాగనంపి, అతను వీధి మొగ తిరిగేదాకా గేటు దగ్గరే నిలబడి చూడ్డంలో ఒక ఆనందం వుంది. అలా వెళ్ళాలనీ, అతను వీధి మలుపు తిరిగేటప్పుడు ఒక్కసారి వెనక్కి తిరిగి, విసిరే చిరునవ్వుని గుండెల్లో పదిలపరచుకోవాలనీ వుంది శశికి. కాని, అమ్మో! అమ్మ చంపెయ్యదూ? ఇలా ఆలోచిస్తూ గోటితో గోడమీద గీతలు గీస్తూ నీరసంగా గోడకి జేర్లాబడి నుంచుంది. అలా పరధ్యానంగా వుండడంవల్ల తల్లి రాకని గమనించలేదు.

వస్తూనే కమలమ్మ ఖయ్‌మంది—

''ఏమిటిది? .... మగపిల్లలతో స్నేహాలా? ఇంటికికూడా ఆహ్వానించ డాలా? .... ఇలాంటివి మన ఇంటా వంటా వున్నాయా? వేషాలు వేశావంటే జాగ్రత్త!''

అవి మాటలూ, కేకలూ కాదు—

గర్జనలూ - నిప్పులూను!

శశి గజగజ వణికిపోయింది. తల్లి కేసి బెదురు చూపులు చూస్తూ వుండి పోయింది.

''ఏం మాట్లాడవేం?'' హూంకరించింది కమలమ్మ.

''ఇందులో తప్పేం వుందమ్మా? సురేంద్ర చాలా మంచివాడు'' - శశి కంఠం బేలగా వణికింది.

''ఆ.... ఆ .... అంతా మంచివారే! ఇలాగే వచ్చి చనువు చేసుకుంటారు. రేపు కొంప మునిగాక - నెత్తీ నోరూ బాదుకోవాలి!''

''నేను చెప్పింది వినమ్మా! అతనే వచ్చాడు - నేను రమ్మనలేదు. నా తప్పేం వుంది ఇందులో?''

''అహా!....ఎదురుప్రశ్న వేసేదాకా వచ్చిందీ? తప్పులేదూ? నువ్వు ఎంత చనువు ఇవ్వకపోతే అతనింత ధైర్యంగా వస్తాడు?''

''చనువేమిటి? నేనసలు ఇప్పటిదాకా అతనితో ఒక్క మాటకూడా మాట్లాడలేదు.''

''ఈ కబుర్లు తీసి పడెయ్యి. ఏదో చెబితే నమ్మేటంత అమాయకురాలిని కాదు నేను. ఏదో ఆ బి ఏ. కాస్తా అయిందనిపించి ఏదైనా ఉద్యోగంలో చేరి నాలుగురాళ్ళు సంపాదిస్తావని, మన కష్టాలు గట్టెక్కుతాయనీ చదివిస్తున్నాను కాని, ఇలా ప్రేమకలాపాలు సాగించే మాటయితే వెంటనే కాలేజీ మానిపించేస్తాను జాగ్రత్త!''

శశి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

''ఆ మహారాజు వెళ్ళిపోయారు. నేనా పుట్టెడు రోగంతో తీసుకుంటున్నాను. నేను కూడా వెళ్ళిపోతే నీ మంచీ చెడూ చూసేవాళ్ళు ఎవ్వరూ ఉండరు. బుద్ధిగా చదువుకుని ఉద్యోగం చూసుకుని మన అంతస్థుకి తగిన ఆలోచనలు పెట్టుకో-అందని పరుగులు పెట్టకు. విన్నావుగా? వాళ్ళమ్మా నాన్నా ఫారిన్‌లో డాక్టర్లు. తాత బిజినెస్. నువ్వు వాళ్ళింట్లో పనిమనిషిగా కూడా పనికిరావు.''

''ఎందుకమ్మా, నన్ను అలా అవమానపరుస్తావు? ఎప్పుడూ నేను అతనితో మాట్లాడలేదని చెప్పాను కదా! ఇకముందు కూడా పలకరించను, ఏ ఆశలూ పెట్టుకోను. సరా?'' అంటూ వలవలా ఏడ్చేసింది శశి.

కమలమ్మ మనస్సు విలవిలలాడింది. మనస్సులో కలవరపాటు పైకి కనిపించనీయకుండా అక్కడినుండి వెళ్ళిపోయింది.

రోజులు గడుస్తున్నాయి....

డిగ్రీ వచ్చిందన్న సంతోషమేకాని, వారాలూ నెలలూ గడుస్తూన్నా ఉద్యోగం ఏం రాకపోయేసరికి, శశి మనస్సులో విషాదమే చోటు చేసుకోసాగింది. ఇల్లు గడవడం నానాటికీ కష్టం అవుతోంది. దానికితోడు కమలమ్మ ఆరోగ్య పరిస్థితి మరీ క్షీణించి. గవర్నమెంటు హాస్పిటల్ కెళ్ళడానికి భయపడి ప్రైవేటు నర్సింగ్‌హోమ్‌లో చేర్పించవలసి వచ్చింది. సమయానికి సరైన వైద్యం జరక్క వెంకట్రామయ్య చనిపోయింది గవర్నమెంట్ హాస్పిటల్‌లోనే - అందుకే కమలమ్మకి గవర్నమెంట్ హాస్పిటల్ అంటే భయం.

ప్రైవేట్ ఆసుపత్రిలో చేరినా కమలమ్మ మనస్సులో దిగులు ఆవరించే ఉంది. డాక్టర్ శారద డబ్బు మనిషి. పేదవాళ్ళని సరిగా చూడదు, పలకరించదు. తనకి వైద్యం సరిగా చేస్తుందో లేదో! ఒకవేళ నయం చేసినా ఆమెకి ఫీజు ఎలా ఇచ్చుకోవడం? శశికి ఇంకా ఉద్యోగం రాలేదు.

కమలమ్మ గుండెల్లో భయం చీకటిలా దట్టం అవుతూనే ఉంది. శశి "ఏం భయంలేదమ్మా - నాకేదో ఉద్యోగం వస్తుంది. మన కష్టాలన్నీ గట్టెక్కుతాయి'' అని ధైర్యం చెబుతూనే ఉంది.

రోజులు భారంగా దొర్లుతున్నాయి.

శశికి కూడా ధైర్యం సన్నగిల్లసాగింది.

ఎన్ని దరఖాస్తులు? ఎన్ని ఇంటర్వ్యూలు? ఎన్ని ప్రయత్నాలు?

ఒక్కటీ ఫలించలేదు!

రోజూ పెరట్లో మొక్కలకి నీళ్ళు పోస్తూ ఆలోచించేది-కాసేపు ఉద్యోగం గురించీ - కాస్సేపు సురేంద్ర గురించీను. సురేంద్ర గురించిన తలపులు తన హృదయంలో తలలూచేసరికి అప్రయత్నంగా ''ఈ కొమ్మ ఇంకా పుయ్యనే లేదు" అని నిట్టూర్చేది శశి.

ఉద్యోగ ప్రయత్నాలు సాగుతూనే ఉన్నాయి ...

ఓ రోజు సిటీబస్ ఎక్కేసరికి సురేంద్ర శశికి ఎదురుగుండా కనిపించాడు.

ఇంతక్రితం చాలామాట్లు బస్‌స్టాప్‌లోనో, బజారులోనో కనిపిస్తూ వచ్చినా, అమ్మ పెట్టిన ఆంక్ష జ్ఞాపకం వచ్చి చూసీ చూడనట్లు తప్పించుకోవటమో, పలకరించబోతే వినిపించనట్లు నటించడమో, ఒకే బస్సు ఎక్కవలసి

వస్తే, ఆ పరిస్థితి తప్పించుకోడంకోసం, ఏ నెంబరు బస్సో ఎక్కి, వెళ్ళిపోవ డమో చేస్తూ ఉండేది.

ఇప్పుడా విధంగా చెయ్యడానికి వీల్లేదు. ఎదురుగుండా కూర్చుని ఉన్నాడు. తనని చూశాడు చిరునవ్వు నవ్వాడు. దిగిపోదాం అంటే బస్సు అప్పటికే కదిలి పోయింది. తను అతనిని చూడనట్లు నటించడానికి వీలేకాదు. మరీ ఎదురుగుండానే కూర్చున్నాడు. పక్కసీటు కాళీగా ఉందేమో. కొద్దిగా జరిగి "ఇలారా కూర్చో శశీ!" అంటూ లాలనగా పిల్చాడు. హాయిగా ఉంది ఆ పిలుపు. మనస్సుని గిలి గింతలు పెట్టింది. గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. మమతలు నిండిన పిలు పుని కాదలేక, అదను తప్పుతూన్న ఇష్టాన్ని అదుపులో పెట్టుకోలేక, వెన్నెల బొమ్మలా నడిచి వెళ్ళి అతని పక్కన ఒదిగి కూర్చుంది. హేండ్ బేగ్ గుండె లకి చేర్చుకుని అతనికి తగలకుండా బిడియపడుతూ జరిగి కూర్చున్న శశిని చూసి నవ్వుకున్నాడు సురేంద్ర.

ఇద్దరి కళ్ళల్లోనూ ఏవేవో చెప్పుకోవాలనే కోరికలు. ఒకరి కళ్ళలోకి ఒకరు సూటిగా చూడలేకపోతున్నారు. అలాగని చూడకుండా ఉండలేకపోతు న్నారు. అది కనిపెట్టినట్లున్నాడు, ఎదురుగా నుంచున్న కొంటెకుర్రాడు ఒకడు-

"కళ్ళలో పెళ్ళి పందిరి కనబడసాగే!" అంటూ ఓ చిన్న కూనిరాగం తీసి నెక్స్ట్ స్టాప్‌లో దిగిపోయాడు.

పెదిమల మీదికి వచ్చిన నవ్వుని సురేంద్రా, శశీ ఆపుకున్నారు.

"ఏవిటీ మధ్యన పలకరించినా పలకడం మానేశావు?" అన్నాడు సురేంద్ర శశి కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

ఆ చూపులోని మధురిమ శశి మనస్సుని కుదిపింది. కాస్సేపు మాట్లాడ లేకపోయింది. తర్వాత అతిప్రయత్నంమీద "అబ్బే ఏంలేదు. ఏదో నా ఉద్యోగం అవస్థాను- అంతే." అనగలిగింది. అప్పుడుకూడా ముఖం తిప్పి అతని వైపు చూడలేక చేతిగోళ్ళకేసి చూస్తూ ఉండిపోయింది.

"అహా.... ఇప్పుడు ఎక్కడికి వెళుతున్నట్టు?"

"సారనాథ్ కంపెనీ అనీ...."

"ఊ....సారనాథ్ కంపెనీలో ...?"

"నీకు తెలుసా ఆ కంపెనీ?"

''ఉహు.... విన్నాను అంతే....''

''ఆ కంపెనీలో క్లర్క్ పోస్టుకి ఇంటర్వ్యూ వచ్చింది. అయితే, ఈ ఉద్యోగం కూడా వస్తుందని నమ్మకం లేదు. రికమెండేషన్ లేదుగా?" విషాదంగా నవ్వింది శశి. సురేంద్ర ఆలోచనలో పడ్డాడు.

''ఊ....మీరేం చేస్తున్నారు? ఖాళీయేనా?'' అంది శశి.

"ఖాళీయే ప్రస్తుతం. కాని, త్వరలో ఫారిన్‌లో ఎం.బి.ఎ. చదవాలని ప్రయత్నం. వీసాకి అప్లయి చేశాను. వస్తాను" అంటూ సడన్‌గా లేచి బస్సు దిగి వెళ్ళిపోయాడు సురేంద్ర. అతని విచిత్ర ప్రవర్తనకి విస్తుపోయింది శశి....

పబ్లిక్ బూత్‌లోంచి ఫోన్ చేసిన సురేంద్రకి అవతలినుంచి "ఆ.... సారనాథ్ కంపెనీయే - నేను ప్రొప్రయిటర్ రామయ్యని మాట్లాడుతున్నాను'' అని వినిపించింది. వెంటనే సురేంద్ర ఆతురతతో, ''తాతయ్యా! నేనూ - సురేంద్రని - ఇవాళ మన కంపెనీలో ఇంటర్వ్యూలు ఉన్నాయిటగా?.... శశి అని ఓ అమ్మాయి వస్తుంది ఆ అమ్మాయికి ఉద్యోగం ఇయ్యి తాతయ్యా!'' అన్నాడు ఫోన్‌లో-'' ఏవిటిరా ఆ కంగారు? ఆ అమ్మాయికి ఉద్యోగం ఇవ్వాలా? నువ్వు రికమెండ్ చేస్తున్నావేమిటి? ఏవిటి కథ?'' అన్నాడు రామయ్య. సురేంద్ర మొదట తొట్రుపడి తర్వాత బతిమాలుతూన్న ధోరణిలో ''ఆ అమ్మాయి పేదది తాతయ్యా. ఆ.... మరేంలేదు .. కొంచెం సాయంచెయ్యి తాతయ్యా'' అన్నాడు. రామయ్య పకపక నవ్వి ''సరేలే'' అంటూ ఫోన్ పెట్టేశాడు.

ఇది జరిగిన నెల్లాళ్ళకి సురేంద్ర రోడ్డుమీంచి వెళుతూవుంటే. శారదా నర్సింగ్ హోమ్‌లోంచి వస్తూ శశి కనిపించింది. కనిపించి ''నాకు ఉద్యోగం వచ్చిందండీ, సారనాథ్ కంపెనీలో'' అంది శశి. సురేంద్ర 'ఆహా' అంటూ ఆశ్చర్యం నటించి ''అయితే, మీరింక మాకు కనిపించరు. ఉద్యోగం బిజీ కదా!'' అన్నాడు నవ్వుతూ.

శశి అంతలోనే తల దించుకొని ''ఏవిటో, ఉద్యోగం వచ్చిన ఆనందం లేదండీ! మా అమ్మగారి ఆరోగ్యం మరీ ఆందోళనగా తయారైంది'' అంది వస్తూన్న కన్నీటిని ఆపుకుంటూ.

ఆమె కళ్ళల్లో నీళ్ళు చూసేసరికి సురేంద్ర కళవళపడ్డాడు. ''అలాగా? ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నారా? ఎవరి దగ్గర? ఏ హాస్పిటల్‌లో?'' అనడిగాడు,

బాధవల్ల గొంతు విడివడక శారదా నర్సింగ్ హోమ్‌ని చేత్తో చూపించి, ''ఆవిడ సామర్థ్యం ఉన్న డాక్టరే! కాని, మాలాంటి బీదవాళ్ళని విసుక్కుంటుంది. డబ్బున్నవాళ్ళని ఆదరణగా పలకరిస్తుంది. ఏదో.... లోకంతీరే అంతలెండి.... వస్తా....'' అంటూ వడివడిగా అడుగులేసుకుంటూ వెళ్ళిపోయింది శశి. ఆమెని అటు వెళ్ళనిచ్చి సురేంద్ర శారదా నర్సింగ్‌హోమ్‌లోకి వెళ్ళాడు.

మర్నాటినుంచి డాక్టర్ శారద తన తల్లిని అంత ప్రత్యేక శ్రద్ధతో ఎందుకు చూస్తోందో, డబ్బు ఇవ్వబోతే ''ఇప్పుడు వద్దులే'' అంటూ ఎందుకు చిరునవ్వు నవ్విందో, ఈ మార్పు ఎందుకు వచ్చిందో వెంటనే అర్థం కాలేదు శశికి.

ఆ రోజు కంపెనీలో పని పూర్తి అయి, ఇంటికి వెళ్ళబోయేముందు ఆఫీస్ రూంలోకి వెళ్ళిన శశికి, నోటమాట రాలేదు. విస్తుబోయి అమట్టునే నుంచుండిపోయింది. మనవడు సురేంద్రతో నవ్వుతూ మాట్లాడుతున్న రామయ్య, మధ్యలో శశి రావడం చూసి, మాటలు ఆపి ''రా అమ్మా శశీ రా'' అన్నాడు.

సురేంద్ర కళ్ళతో శశిని పలకరించి నవ్వుతూ కూర్చున్నాడు.

ప్రొప్రయిటర్‌గారితో సురేంద్రకేవిటి పరిచయం?

ఇంత ఫ్రీగా మాట్లాడ్డం ఏవిటి ఆయనతో.

"నిలబడిపోయావేమమ్మా!" రామయ్య అడిగాడు.

"వీరు ...? మీ .. కు...." అర్థోక్తిలో ఆగిపోయింది శశి.

"వీడా?.... వీడు....?" అని చెప్పబోయి అంతలోనే 'చెప్పకు తాతయ్యా ప్లీజ్!' అన్నట్లు చూడడంతో, మాట తప్పించి "వీడమ్మా.... నాకు మనవడు లాంటివాడు.... మనవడే అనుకో'' అంటూ పకపకా నవ్వాడు రామయ్య.

''అలాగాండి!'' అంటూ శశి వెళ్ళిపోయిన తర్వాత రామయ్య మనవడి కేసి తిరిగి సీరియస్‌గా ''ఏవిట్రా? ఏవిటి నీ వ్యవహారం? ఆ అమ్మాయికి ఉద్యోగం వేయించావు; వాళ్ళ అమ్మకి మంచి ట్రీట్‌మెంట్ ఇమ్మని డాక్టర్ శారదకి చెప్పి ఫీజు నువ్వు చెల్లిస్తున్నావు-ఏవిటిదంతా?'' అన్నాడు.

''ఆ అమ్మాయి ముఖం చూస్తే జాలేసి సాయం చెయ్యాలనిపించింది. అంతే, ఇందులో తప్పేం ఉంది?''

''తప్పా తప్పన్నరా? వయస్సులో ఉన్న కుర్రాడికి మరో వయస్సులో ఉన్న అమ్మాయి పట్ల జాలివేసింది అంతే ఏమిటో తెల్సా? ప్రేమలో పడ్డాడన్న మాట! సర్లే - జరిగిందేదో జరిగింది ఇహ ఊరుకో! జాలీగిలీ అంటూ ఇక పీదట ఆ అమ్మాయిని పరికరించకు. ఈ సోగ కళ్ళ అమ్మాయిలు మనస్సుల్ని స్వంతం చేసుకుంటారు. జాగ్రత్తగా ఉండాలి.''

''శశి మంచిది తాతయ్యా!''

''అహా! అంతవరకూ వచ్చిందీ? పేదరికం చూడలేక ఆ అమ్మాయిని ఉద్యోగంలోనూ, వాళ్ళమ్మని హాస్పటల్‌లోనూ జేర్పించావు. అంతటితో ఆపు. ఆ అమ్మాయిని మనస్సులో జేరనియ్యకు. అనక ప్రేమా, పెళ్ళి, దాకా ఎదుగుతుంది ఈ అనుబంధం.''

''ప్రేమిస్తే తప్పా తాతయ్యా?''

''తప్పు కాదురా! అది మనకి కలిసి రాలేదు నేను చిన్నప్పుడు, అంటే నీ వయస్సులో ఉన్నప్పుడు పక్కింటి పద్మావతిని ప్రేమించాను. అది తెలిసి వాళ్ళ నాన్న, ఆ అమ్మాయిని బయటికి రానియ్యకుండా కట్టుదిట్టంచేసి పెళ్ళి చేసేశాడు. తర్వాత మా నాన్న నాకు వేరే సంబంధం చూసి పెళ్ళి చేశాడనుకో. అది అలా జరిగిందా? ఇంక నా కూతురు- అదే మీ అమ్మ. తన ఫ్రెండ్ ఇంట్లో వీధి గదిలో అద్దెకి ఉంటూన్న బేంకి ఆఫీసర్ని ఎవర్నో ప్రేమించింది. చెయ్యి జారిపోక ముందే తెలిసింది ఏమిటంటే. ఆ ఆఫీసరుకి అంత క్రితమే పెళ్ళయిందని. మీ అమ్మ అప్పటికే మెడిసిన్ ఫైనలియర్‌లో ఉంది. నేను వెంటనే మీ అమ్మని బ్రతిమాలి వప్పించి మరో డాక్టర్ని చూసి పెళ్ళి చేసేసి ఇద్దర్నీ ఫారిన్ పంపించేశాను. ఇప్పుడు చూడు. ఇద్దరూ టింగురంగా అంటూ అక్కడ ఉన్నారు, నీ పోషణా సంరక్షణా భారం అంతా నాకు ఇక్కడ వదిలేసి. అందువల్ల ప్రేమపెళ్ళిళ్ళు మనింట్లో కలిసిరావు... నా మాట విని...." ఇలా తాతయ్య సురేంద్రకి హితవచనాలు చెబుతూ ఉండగా, శారదా నర్సింగ్ హోమ్ నుంచి కబురు వచ్చింది, కమలమ్మ పరిస్థితి సీరియస్‌గా వుందని....

కమలమ్మ చనిపోయిన రెండు నెలలకి, శశితోబాటు రామయ్యా సురేంద్రల మనస్సులు కూడా కుదుటబడ్డాక, ఓ రోజున రామయ్యా సురేంద్రని పిలిచి ''నువ్వు శశిని పెళ్ళిచేసుకో'' అన్నాడు.

సురేంద్ర విస్తుపోతూ "మరి మనింట్లో ప్రేమ వివాహాలు కలిసిరావు అన్నావు?" అనడిగాడు, తాతయ్య తనతో పరాచికం ఆడుతున్నాడని అనుమానించి.

"ఇది ప్రేమ వివాహం కాదురా....తాతయ్య నీకు కుదురుస్తూన్న పెళ్ళి. పెద్దలు చేస్తూన్న పెళ్ళి లాంటిదే. తెలిసిందా? మరీ బెట్టుచెయ్యకు. మీ అమ్మకీ నాన్నకీ కేబుల్ ఇయ్యి. శశి మంచిపిల్ల. ఆ అమ్మాయికి అన్యాయం జరక్కూడదు ..." ఇలా ఏవేవో చెప్పాడేకాని, ఈ శశి తను పూర్వం ప్రేమించిన పద్మావతి మనుమరాలనీ, కమలమ్మ మరణశయ్య మీద ఉండగా చెప్పిన మాటల్నిబట్టీ, తర్వాత వాళ్ళింట్లో చూసిన పాత ఉత్తరాల్నీ, కాగితాలనుబట్టీ తానీ విషయం కనుక్కోగలిగాననీ మాత్రం చెప్పలేదు రామయ్య. తను పద్మావతిని పెళ్ళి చేసుకోలేకపోయినా, ఆమె మనుమరాలిని తన మనుమడికిచ్చి చేశాననే సంతృప్తి, రామయ్య మొహంలో కనిపించింది

శశి పుట్టింటినుంచి తెచ్చుకున్న వస్తువుల్లో పూలకుండీ కూడా ఒకటి. ఓ రోజు కుండీలో నీళ్ళుపోస్తూ "ఈ కొమ్మ పూసింది చూశారా?" అంది శశి. వెంటనే సురేంద్ర, శశిని చూపించి, "ఈ కొమ్మ పూసింది" అన్నాడు. సిగ్గుతో శశి బుగ్గలు సొట్టలు పడ్డాయి. అవతల వరండాలో భగవద్గీత చదువుకుంటున్న రామయ్య గుబురు మీసాల వెనుక చిరునవ్వు దోబూచులాడింది. *

(వనితాజ్యోతి - '85)